క్లుప్తంగా

సేవలు దేశానికే ఆదర్శవంతం



రిజిస్టర్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: సచివాలయాల్లో ప్రజలకు సిబ్బంది అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శవంతమని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేలా విధులు నిర్వర్తించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రిజిస్టర్లను, మూమెంట్ రిజిస్టర్, క్యాంపుల వివరాలను పరిశీలించిన అనంతరం ఆయన ఉద్యోగులతో మాట్లాడారు. మండలంలో గృహ నిర్మాణ పనులపై నిత్యం పర్యవేక్షిస్తూ త్వరితగతిన వాటిని పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 135 పశువులకు నట్టల నివారణ, పిడుదులకు మందులు పిచికారీ చేశారు. పాడి రైతులకు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి తబ్రిద్ బాషా, తేజ, షబ్బీర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



వి.కోట: ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర 2024 క్యాలెండర్లను శుక్రవారం మండలంలో ఎంపీపీ యువరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రతి ఏటా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలతో కూడిన క్యాలెండర్లను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ అందేలా ఎమ్మెల్యే చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు భూపతి, నాయకులు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అనపకాయలతో చేసిన పిలికిపప్పుతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గుడుపల్లె: పశువుల పాకలో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. బంధువుల కథనం మేరకు.. మండలంలోని కోడిగానిపల్లె గ్రామానికి చెందిన శివప్ప(36) సాయంత్రంలో పొలం వద్ద ఉన్న పశువుల పాకలో పశువులను బయట నుంచి తీసుకుని వెళ్లి లోపల కట్టి వాటికి మేత వేశాడు. అనంతరం పశువుల పాక నుంచి బయటికి వచ్చే సమయంలో ఇనుప డోర్ వేస్తుండగా డోర్‌కు అనుకుని ఉన్న కరెంట్ వైర్లు తగలడంతో శివప్ప కరెంట్‌షాక్‌కు గురై అపస్మారకస్థితికి చేరుకున్నాడు.అక్కడున్న స్థానికులు వెంటనే గుర్తించి, అతడిని కుప్పం ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శివప్పకు భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

ఈరోజు

విద్యుత్ అంతరాయం

పలమనేరు: సబ్‌స్టేషన్ల మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పలమనేరు, రూరల్ మండలంలో కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మామిడి రైతులకు శిక్షణ

రామకుప్పం: మండలంలోని మామిడిని ఆశించే తెగుళ్ల, చీడపీడల నివారణ, సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. తిరుపతికి చెందిన పలువురు శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని, మామిడి రైతులు దీనికి హాజరు కావాలని కోరారు.

సమాజానికి నీతిని నేర్పిన మహనీయుడు వేమన

- విశ్వసనీయతకు రెడ్లు మారుపేరని వైఎస్సార్ నిరూపించారు
- పేద రెడ్ల సంక్షేమానికి రెడ్డి సంఘాలు మరింతగా పాటుపడాలి
- యోగివేమన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్లు వెంకటేగౌడ, శ్రీనివాసులు



వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, ట్రస్ట్ సభ్యులు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: సమాజానికి నీతిని నేర్పిన మహనీయుడు వేమన అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కీర్తించారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో యోగి వేమారెడ్డి జయంతి వేడుకలను స్థానిక యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు చెంగారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత మెయిన్ రోడ్డులోని నూతనీకరించిన యోగివేమారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభావేదిక వద్ద వేమన చిత్రపటం ఏర్పాటు చేసి ప్రార్థన, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాల అనంతరం ముఖ్య అతిథులు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. పౌరుషానికి, త్యాగానికి, నలుగురికి అన్నం పెట్టేందుకు, ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సమస్యల పరిష్కారానికి రెడ్లు ముందు వరుసలో ఉంటారన్నారు. అటువంటి వంశంలో జన్మించిన వేమారెడ్డి జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చూసి మనిషి ఎలానీతిగా ఉండాలో తన పద్యాల ద్వారా సమాజాన్ని జాగృతం చేసేందుకు యత్నించారన్నారు. సీపీ బ్రౌన్‌లాంటి చరిత్రకారులు వేమన పద్యాలను వెలుగులోకి తెచ్చి, ఆ పద్యాల ఘనతను చాటిచెప్పారన్నారు. పామరులను సైతం తన పద్యాలతో మెప్పించిన కవిగా ఇప్పటికీ తెలుగువాళ్ల నాలుకలపై వేమన పద్యాలు వినిపిస్తున్నాయన్నారు. రెడ్లపాలనలో ప్రజలు సుభిక్షంగా ఉంటారనేందుకు గతంలో వైఎస్సార్, నేడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనే సాక్ష్యమని పేర్కొన్నారు. వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలను జారీ చేసి సీఎం వేమనకు సముచిత గౌరవాన్ని కల్పించారన్నారు. రాబోవు రోజుల్లో వైవీఆర్ ట్రస్టు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పట్టణంలో వేమన భవన నిర్మాణానికి తమవంతు సాయం చేస్తామని ప్రకటించారు. అంతకుముందు యోగి వేమారెడ్డి ట్రస్టు సేవా కార్యక్రమాలను అధ్యక్షులు చెంగారెడ్డి వివరించారు. వేమన జీవితం నేటి సమాజానికి ఎలా విలువలను నేర్పుతుందో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి వివరించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నియోజకవర్గంలోని 300 మంది టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, వృద్ధులకు దుప్పట్లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ట్రస్ట్ పంపిణీ చేసింది. తామంతా ప్రభుత్వ బడుల్లో జగన్ మామ ప్రవేశపెట్టిన ఆంగ్లమాధ్యమంలో చదువుతున్నామని హర్షధ్వానాల మధ్య విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పిల్లల గ్రోవులు, వేమన పద్యాలు చెప్పడం అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు బాలాజీరెడ్డి, కొండారెడ్డి, కార్యదర్శి అమరనాథ రెడ్డి, కోశాధికారి జయశంకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు రమేష్‌రెడ్డి, శ్రీనాథ్, ఆనంద్‌రెడ్డి విజయ్, కొండారెడ్డి, జైకుమార్, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీరాములురెడ్డి, పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నియోజకవర్గంలోని రెడ్లు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీలో..



ప్రసంగిస్తున్న ద్రవిడ వర్సిటీ ఉపకులపతి

కుప్పం: ప్రజాకవి, సంఘ సంస్కర్త వేమన జయంతిని శుక్రవారం ద్రవిడ వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలో వేమన భవనంలోని వేమన చిత్రపటానికి పూలమాలలు ఉపకులపతి కొలకలూరి మధుజ్యోతి నివాళులు అర్పించారు. తెలుగులో వేమన పద్యాలు అందరికీ సుపరిచితమేనని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు బంగ్లాదేశ్, బర్మా తదితర దేశాలు, ప్రవాసాంధ్రులు నివసిస్తున్న దేశాల్లో కూడా వేమన పద్యాలు ప్రాచుర్యం పొందాయని ఆమె పేర్కొన్నారు. వేమన పద్యాలను ఇప్పటికీ శుభకార్యాలు, ఇతర కార్యకలాపాల్లో చెబుతుంటారని, ఎంతచదివినా తరగనిది వేమన పద్య సంపద అని అభివర్ణించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ వస్తువులను వినియోగిస్తే విద్యుత్ ఆదా

- ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

పుంగనూరు: క్వాలిటీ ఉన్న వైర్లు, ఉపకరణాలు మొదలైన వాటిని వినియోగిస్తే విద్యుత్ వినియోగం ఆదా అవుతుందని, దీనితో పాటు ఆదాకు మరికొన్ని విధానాలు కూడా పాటించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి కోరారు. విద్యుత్ పొదుపు చేయడం అంశంపై రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం నిర్వహిస్తున్న సదస్సులో రెండవరోజు శుక్రవారం ఎస్ఈ మాట్లాడారు. ఇళ్లలో వినియోగిస్తున్న బల్బుల నుంచి ఫ్రిజ్‌లు, ఏసీలు, కూలర్లు మొదలైనవి కొనుగోలు చేసే సమయంలో నాణ్యతాప్రమాణాలతో ఉన్నవాటినే కొనుగోలు చేయాలన్నారు. నాణ్యత లేని వాటి వల్ల విద్యుత్ అధిక వినియోగంతో పాటు బిల్లుల మోత కూడా పెరుగుతుందన్నారు. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి సహజ సిద్ధంగా లభించే సూర్యరశ్మి ఒక వనరుగా దోహదపడుతోందని, అందుకే పలు ప్రాంతాలలో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను దుబారాగా వినియోగించరాదని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్, ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ రవి, ఏఈలు , సంస్థ ప్రతినిధులు వెంకట్రమణ, డీఈఈలు శ్రీనివాసులు, మహేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది , సచివాలయ ఎనర్జీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి డాక్రా మహిళలకు సమావేశాలు

సదుం: వైఎస్సార్ ఆసరాకు సంబంధించి మండలంలో శనివారం నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించనున్నట్టు ఏపీయం హరిప్రసాద్ తెలిపారు. 20న ఎర్రాతివారిపల్లె, బూరగమంద, మొరవపల్లె, జోగివారిపల్లె, చెరుకువారిపల్లె, నడిగడ్డ, 22న 79– ఏ చింతమాకులపల్లె, ఊటుపల్లె, చింతలవారిపల్లె, పాలమంద, కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె, 23న తిమ్మానాయనపల్లె, గొంగివారిపల్లె, అమ్మగారిపల్లె, రెడ్డివారిపల్లె, తాటిగుంటపాలెం, సదుంలో సమావేశాలు నిర్వహిస్తామని తెలియజేశారు. మహిళా గ్రూపు సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఫిబ్రవరి 17, 18 తేదీల్లో రోబో ట్రాక్ పోటీలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ చాప్టర్ సహ భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు వచ్చేనెల 17, 18వ తేదీల్లో రోబోట్రాక్– 2024 పోటీలు నిర్వహించనున్నట్టు ప్రొఫెసర్ రాళ్లపల్లి రామమూర్తి, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఎస్వీయూ మాజీ వీసీ సుదీప్తా సాహా తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. అయన మాట్లాడుతూ మొదటి రోజు పోటీల్లో బృందం లైన్– ఫాలోయింగ్ రోబోట్ రూపొందించి స్వయంప్రతిపత్తితో పని చేసే విధానంపై ప్రోగ్రామింగ్ చేయాలని తెలిపారు. రెండో రోజు బృందం రూపొందించిన రోబోట్‌ను ట్రాక్‌ను అనుసరించి కనిష్ట సమయ వ్యవధిలో గమ్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ పోటీలో విజేతలకు నగదు మొదటి బహుమతిగా రూ.5,000, రెండో బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 12 లోపు తమ దరఖాస్తులను పంపాలన్నారు. వివరాలకు 0877–2286202, 7989694681 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కులగణన ప్రారంభం





సర్వే ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ , పెద్దపంజాణి: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పలమనేరు: మున్సిపాలిటీలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం కులగణన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి తన ఇంటి వద్ద నుంచి శ్రీకారం చుట్టారు. అలాగే, ఆయా వార్డు సచివాలయాల వద్ద కౌన్సిలర్లు ప్రారంభించారు. చాముండేశ్వరి మాట్లాడుతూ కులగణన చేయడంతో సమాజంలోని ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుస్తాయన్నారు. దీంతో ఆర్థికంగా వారిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉంటుందన్నారు. వివరాల సర్వే నిమిత్తం ఇళ్ల వద్దకు వచ్చే సచివాలయ సిబ్బందికి ప్రజలు వారి కులాన్ని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండీసుధా, నాయకులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా 19 సచివాలయాల గ్రామాలలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభించారు. లింగాపురంలో చేస్తున్న సర్వేను ఎంపీడీఓ అబ్దుల్ రహీం పరిశీలించారు. తప్పులు లేకుండా పక్కాగా సర్వే చేయాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత మండిపేట కోటూరు



పలమనేరు: మండిపేట కోటూరు జట్టు



బైరెడ్డిపల్లె: కబడ్డీ విజేత జట్టుతో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప





పెద్దపంజాణి: క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, పులిచెర్ల: దేవళంపేటలో..

పలమనేరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడల్లో కబడ్డీ టోర్నీ విజేతగా మండిపేట కోటూరు పంచాయతీ జట్టు నిలిచింది. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఫైనల్స్ నిర్వహించినట్టు ఎంపీడీఓ విద్యాసాగర్ తెలిపారు. అంతకుముందు ఆయన ఇప్పటికే గెలిచిన క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖో–ఖో క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అందిన క్రీడాదుస్తులు, ఇతరత్రా వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుందరం, ఈవోఆర్డీ గిరిధర్, పీడీలు, పీఈటీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో తీర్థం జట్టు...

బైరెడ్డిపల్లె: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీల్లో తీర్థం జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ రాజేంద్రబాలాజి తెలిపారు. సచివాలయ స్థాయిలో ఎంపికైన కబడ్డీ జట్లు శుక్రవారం బైరెడ్డిపల్లెలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు విన్నర్స్ జట్టును అభినందించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పెద్దపంజాణి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా శుక్రవారం మండలంలోని రాయలపేట, రాజుపల్లె, చలమంగళం, చిన్నేపల్లెలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పెద్దపంజాణిలో ఎంపీడీఓ అబ్దుల్ రహీం పోటీలు ప్రారంభించి మాట్లాడారు. శనివారం రాయలపేటలో సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

దేవళంపేటలో..

పులిచెర్ల(కల్లూరు): ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి శుక్రవారం దేవళంపేటలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీడీఓ రాజశేఖర్ ప్రారంభించారు .రెండురోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. పీఈటీలు రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతిస్తాం



ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న రైల్వే డీఆర్ఎం, ఎమ్మెల్సీ

- రూ.6కోట్లు ఆంధ్ర ప్రభుత్వ భాగస్వామ్యం కోరిన డీఆర్ఎం
- సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్న భరత్



డీఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి దక్షిణ, పశ్చిమ రైల్వే డివిజినల్ మేనేజర్ యోగేష్ మోహన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. శుక్రవారం కుప్పం రైల్వే స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్సీ భరత్ కలిశారు. రైల్వేగేటు శాశ్వతంగా మూసివేయడం వల్ల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, అంతేకాకుండా కొత్తపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఉండటం వల్ల నిత్యం 3వేల మంది విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే రైల్వే స్టేషన్ దక్షిణ, పశ్చిమ వైపు 50 పైచిలుకు గ్రామాల ప్రజలు నిత్యం తమ పనుల నిమిత్తం రైలుపట్టాలు దాటవలసి వస్తోందని, ఇలాంటి సమయంలో రైళ్లు ఢీకొని మరణించిన వారు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రైల్వే గేటు స్థలంలో ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని డీఆర్ఎంను ఆయన కోరారు. దీనిపై డీఆర్ఎం స్పందించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని, దాదాపు రూ.6 కోట్లు ఆంధ్ర ప్రభుత్వం నిధులు మంజూరు అంగీకారం తెలుపుతూ తమ రైల్వే జీఎంకు నివేదిక పంపితే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. దీనిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్సీ బదులిచ్చారు. దీంతో పాటు మల్లానూరు, గుడుపల్లె రైల్వే స్టేషన్ సమస్యలు ఆయనకు నివేదించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మురుగేష్, స్థానిక కౌన్సిలర్ హంస, సోమశేఖర్, సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

రొంపిచెర్ల: పోలింగ్ కేంద్రాలలో అధికారులకు, ఓటర్లకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం తన కార్యాలయంలో తహసీల్దార్ సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, ఇంటర్‌నెట్, మరుగుదొడ్లు.. ఇత్యాది సదుపాయాలను హెచ్‌ఎంలు కల్పించాలన్నారు. ఈ దిశగా దృష్టి సారించి, ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్ర, ఎంఈఓ శ్రీనివాసులు, డీటీలు లోకేష్, వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 37 పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ శేషగిరిరావు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఉండాలన్నారు. కార్యక్రమంలోఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓ సిద్ధరామయ్య పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుపై ఏర్పాటు చేసే పార్కు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రమేష్, అలీమ్‌బాషా

పుంగనూరు: పట్టణంలో పార్కులు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలను శుక్రవారం గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్ పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుపై ఇరువైపులా మొక్కలు నాటి, బెంచీలు, లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే గోకుల్ సర్కిల్ వద్ద, పుంగమ్మ చెరువు కట్టపైన, ఎల్‌ఐసీ కాలనీలో మొత్తం కలసి నాలుగు పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.32 లక్షలు విడుదల చేశారని తెలిపారు. పార్కులలో ప్రజలకు వాకింగ్ ట్రాక్‌లు, లైట్లు ఏర్పాటు చేసి, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని, నెలలోపు ఈ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ మహేష్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరాం, కౌన్సిలర్ కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష



బైరెడ్డిపల్లె: కడపనత్తంలో వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంలాంటిదని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. మండలంలోని కడపనత్తం సచివాలయంలో శుక్రవారం ।జగనన్న ఆరోగ్య సురక్ష–2' కార్యక్రమం ప్రారంభించి ఆయన మాట్లాడారు. శిబిరంలో వైద్యాధికారులు కిజియా రాణి, ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, విజయ్‌చంద్ర వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

409 మందికి వైద్య పరీక్షలు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం–2 నిర్వహించారు. శిబిరంలో 409 మందికి వైద్యాధికారులు మురళి, తమన్నాజ్, గిరీష్మా బిందు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ నిమిత్తం ఒకరిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. తొలుత శిబిరాన్ని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ హరినాథ్, ఉప సర్పంచ్ కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్, పీఎస్ పవన్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చ పత్రికలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు



చౌడేపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందుకుంటున్న ప్రజలు చైతన్యవంతులయ్యారని, పచ్చ పత్రికలు పనికట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మే స్థితిలో లేరని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంజిబాబు తెలిపారు. శుక్రవారం ఎంపీపీ రామమూర్తితో కలిసి ఎంపీపీ చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. తరచూ కరువు కాటకాలతో ఉన్న చిత్తూరు జిల్లాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీనికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పచ్చమీడియా విషపు రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. తప్పుడు రాతలు రాస్తే రాబోయే రోజుల్లో ఈ పత్రికలను శాశ్వతంగా బహిష్కరిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్ భరత్, డీసీసీబీ డైరెక్టర్ రమేష్ బాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి మంజునాథ్, సర్పంచ్ కృష్ణారెడ్డి, భరత్ వరుణ్, ఉప సర్పంచ్ అల్తాఫ్, నేతలు సద్దాం, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.